ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
7
గురువారం 31 అక్టోబరు 2024

వెలుగుల సందడి



నేడు దీపావళి పర్వదినం

కొనకుండానే పేలుతున్న టపాకాయలు

పలు ప్రాంతాల్లో వర్షం.. కొనుగోళ్లపై ప్రభావం

వెలుగుల పండుగ వచ్చేసింది. కులమతాలకు అతీతంగా, చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా అందరూ సంతోషంగా చేసుకునే పండుగకు అంతా సిద్ధమయ్యారు. చెడుపై మంచి సాధించిన విజయానికి, దుష్టశక్తిపై దైవశక్తి గెలుపునకు చిహ్నంగా, చీకటిని పారద్రోలి వెలుగులు తెచ్చే పండుగగా తెలుగునాట దీపావళికి అత్యంత ప్రాధాన్యం ఉంది. గురువారం దీపావళి కాగా బుధవారం నుంచి ఆ సందడి కనిపించింది. గురువారం పండుగ సెలవు కావడంతో విద్యా సంస్థల్లో బుధవారమే దీపావళి పర్వదిన వేడుకలు విద్యార్థుల కేరింతల మధ్య జరిగాయి. దీపాలతో అలంకరణలు, టపాకాయల కాల్చి విద్యార్థులు సందడి చేశారు.

గుంటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రాలైన గుంటూరు, బాపట్ల, నరసరావుపేటలతో పాటు మున్సిపల్, మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లోనూ టపాకాయల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గతంలో ఎన్నడూ లేనట్లుగా ఈ ఏడాది టపాకాయల దుకాణాలు వెలిశాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగా ఆ సంతోషాన్ని సంబరంగా జరుపుకునే అవకాశం ఉందని వ్యాపారులు పెద్దఎత్తున దుకాణాలు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. వ్యాపారుల అంచనాకు తగ్గట్లుగానే బుధవారం మధ్యాహ్నం నుంచి దుకాణాల వద్ద

(మిగతా 8లో)


గుంటూరులో వర్షానికి నీట మునిగిన దుకాణాలు


నరసరావుపేటలోని స్టేడియంలో దీపావళి బాణసంచా షాపులు


గుంటూరులో కొనుగోళ్ల సందడి


చిలకలూరిపేటలో ప్రమిదలు, పూలతో అలంకరణ

కార్యకర్తలకు న్యాయం చేస్తాం

◆ ఎమ్మెల్యేల సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి ◆ ఆత్మీయ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, పక్కన ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యేలు యరపతినేని, కన్నా, పుల్లారావు, జీవీ, బ్రహ్మారెడ్డి, ప్రవీణ్, ఎమ్మెల్సీ జంగా తదితరులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో కావాలనే టీడీపీ వారిపై రౌడీషీట్ తెరిచారు.. ఆయా కేసులపై త్వరలో సమీక్ష చేసి కార్యకర్తలకి న్యాయం చేస్తాం.. అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. నరసరావుపేటలో బుధవారం జరిగిన కూటమి నేతల ఆత్మీయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. జిల్లా అభివృద్ధి పనుల విషయంలో ఎమ్మెల్యేలను కలుపుకుని ముందుకు వెళ్తామన్నారు. రాష్ట్రంలో ఒకేసారి 175 అన్న క్యాంటీన్లు ప్రారంభించిన ఘనత చంద్రబాబు నాయుడిదన్నారు. డీఎస్సీ ద్వారా 16 వేల ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతు బాగుంటేనే అందరం బాగుంటామనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకి న్యాయం జరుగుతుందని, అందరం కలిసి కట్టుగా పనిచేసి జిల్లాని అభివృద్ధి చేసుకుందామన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ అభివృద్ధి పనుల విషయంలో ఎక్కడా రాజీ పడటం లేదని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో రాష్ట్ర అభివృద్ధికి రెండు లక్షల కోట్లు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. పవన్‌కల్యాణ్‌ను గతంలో వైసీపీ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని, కానీ ఈ రోజు వారి పరిస్థితి ఎలా ఉందో చూసుకోవచ్చన్నారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ గత పాలనలో, కూటమి అధికారం వచ్చేందుకు కష్ట పడిన ప్రతి కార్యకర్తని గుర్తించుకుంటామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహాన్ని తొలగించిన అధికారులను గుర్తించి త్వరలో సస్పెండ్ చేస్తామన్నారు. వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా అఖండ విజయం సాధించాలన్నారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నా సరే అభివృద్ధిలో ఆగడం లేదని తెలిపారు. జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులపై త్వరలో సీఎం చంద్రబాబుని కలుస్తామన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, కపిలవాయి విజయకుమార్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకులు గాదె వెంకటేశ్వరరావు, సయ్యద్ జిలాని, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, డాక్టర్ కడియాల లలిత్ సాగర్, శివనాగమల్లేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్‌బాబు, గోనుగుంట్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న సేవకు ఇద్దరు

టీటీడీ బోర్డులో జంగా, తమ్మిశెట్టిలకు చోటు

పల్నాడు జిల్లా నుంచి మళ్లీ జంగాకు అవకాశం

గుంటూరు జిల్లా నుంచి చేనేతవర్గ మహిళకు పదవి


జంగా కృష్ణమూర్తి


తమ్మిశెట్టి జానకీదేవి

పిడుగురాళ్ల, మంగళగిరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇల వైకుంఠంగా ప్రసిద్ధి చెంది.. ప్రపంచవ్యాప్తంగా భక్తులు ఉన్న తిరుమల వేంకటేశ్వరుడి సేవకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఇద్దరికి చోటు దక్కింది. కూటమి ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి టీటీడీ బోర్డులో చోటు కోసం పలువురు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం టీటీడీ పాలకవర్గ మండలిని ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో పల్నాడు జిల్లా నుంచి మళ్లీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తికి, గుంటూరు జిల్లా నుంచి తమ్మిశెట్టి జానకీదేవికి అవకాశం లభించింది. 1999, 2004లో ఎమ్మెల్యేగా గెలుపొందిన దాచేపల్లి మండలం గామాలపాడుకు చెందిన జంగా కృష్ణమూర్తి 2004, 2006లో రెండు దఫాలుగా తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడిగా ఉన్నారు. 2024 ఎన్నికలకు ముందు జంగా కృష్ణమూర్తి వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జంగా కృష్ణమూర్తిని టీటీడీ బోర్డు మెంబర్‌గా నియమించారు. టీడీపీలో బీసీలకు సముచిత స్థానం కల్పించేలా చంద్రబాబు తీసుకున్న నిర్ణయానికి గురజాల ఎమ్మెల్యే యరపతి నేని శ్రీనివాసరావు, కూటమి నేతలు, బీసీ సంఘాలు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. టీటీడీ బోర్డు మెంబరుగా నియమితులైన జంగా కృష్ణమూర్తిని ఎమ్మెల్యే యరపతినేని అభినందించారు.

మంగళగిరి నుంచి మళ్లీ మహిళకే..

టీటీడీ ధర్మకర్తల మండలిలో మంగళగిరికి చెందిన తమ్మిశెట్టి జానకీదేవికి చోటు లభించింది. టిటిడి ధర్మకర్తల మండలిలో మంగళగిరి నుంచి ప్రాతినిథ్యం వహించిన వారిలో జానకీదేవి రెండోవారు. గతంలో కాండ్రు కమల తొలిసారిగా టీటీడీ బోర్డులో స్థానం పొందగా ప్రస్తుతం మళ్లీ మహిళకే పదవి వరించింది. మంగళగిరి నుంచి టీటీడీలో ప్రాతినిథ్యం వహించిన ఇద్దరు కూడా చేనేత వర్గానికి చెందినవారు కావడం విశేషం.

పిన్నెల్లి అండతో రెచ్చిపోయారు

- పల్నాడు పోలీసుల తీరుపై అనేక ఆరోపణలు
- హైకోర్టు న్యాయవాది వేధింపుల వెనుక వైసీపీ ఒత్తిళ్లు
- వేధింపుల్లో కీలక సూత్రధారిగా డీఎస్పీ పల్లంరాజు
- ఆయన చెప్పినట్టు చేసిన ఎస్ఐ రబ్బానీ, కానిస్టేబుల్ వెంకటరావు
- పల్లంరాజుపై ఆది నుంచి ఆరోపణలు
- విజయవాడ, కాకినాడలో అనేక అక్రమాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

విజయవాడలో హైకోర్టు న్యాయవాది హరిబాబును పల్నాడు పోలీసులు వేధించడం వెనుక అప్పటి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హస్తం ఉందని తెలుస్తోంది. ఆయన అండదండలు చూసుకుని అప్పటి గురజాల డీఎస్పీ ఎ.పల్లంరాజు, పిడుగురాళ్ల ఎస్ఐ రబ్బానీ, కానిస్టేబుల్ వెంకటరావు వీరంగం వేశారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. హరిబాబుపై జరిగిన వేధింపులకు సంబంధించి పిడుగురాళ్ల పీఎస్‌లో నమోదైన కేసు విజయవాడ పటమట పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. చట్టబద్ధంగా వ్యవహరించాల్సిన పోలీసులు పిన్నెల్లి అనుచరుడు కర్నాటి వీరభద్రరావు వైపు వకల్తా తీసుకున్నారు. హరిబాబు నుంచి వీరభద్రరావు తీసుకున్న అప్పును తిరిగి ఇప్పించకపోగా అతడి ఆస్తులను బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించారు. దీంతోపాటు హరిబాబు వద్ద నుంచి రూ.కోటి వరకు లాగేశారు. ఈ విషయాలన్నీ ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. వాటితోపాటు డీఎస్పీ పల్లంరాజు పోలీసు ఉద్యోగంలో అడుగుపెట్టినప్పటి నుంచి చేసిన అక్రమాల చిట్టా తాజాగా బయటకు వస్తోంది.

విజయవాడలో పల్లంరాజు మార్కు

పల్లంరాజు 1991లో ఎస్ఐగా పోలీస్ శాఖలో అడుగుపెట్టారు. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత నుంచి ఆయన సర్వీసు మొత్తం విజయవాడలో సాగింది. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురానికి చెందిన పల్లంరాజు 20 ఏళ్లకుపైగా విజయవాడలో పని చేశారు. ఎస్ఐగా కమిషనరేట్‌లో పోస్టింగ్ తీసుకుని ఇక్కడే ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఇన్‌స్పెక్టర్‌గా పటమట, టాస్క్‌ఫోర్స్ వంటి కీలక పోలీస్ స్టేషన్లలో పనిచేశారు. నాడు విజయవాడలో జరిగిన భూవివాదాల కేసుల్లో సెటిల్‌మెంట్లు చేసి లక్షలాది రూపాయలను వసూలు చేశాడన్న ఆరోపణలు ఉన్నాయి. నీతి నిజాయితీగా పనిచేసి ఒక మార్కును వేయించుకున్న అధికారులకంటే కమిషనరేట్‌లో పల్లంరాజు మార్క్ ఎక్కువగా కనిపిస్తోంది. పోలీస్ శాఖలో ఎవరిని కదిపినా పల్లంరాజు గురించి పెద్ద చిట్టా విప్పుతున్నారు. ఈయన ఇక్కడ పనిచేసినప్పుడే భారీగా ఆస్తులను కూడబెట్టుకున్నట్టు సమాచారం. విజయవాడలో ఉన్న ప్రముఖ రాజకీయ నేతలు, వ్యాపారవేత్తలతో పాటు అక్రమాలకు పాల్పడే మాఫియాలతో ఈయనకు ఇప్పటికీ సంబంధాలు ఉన్నాయని చెప్పుకుంటున్నారు. పోలీస్‌శాఖలో పల్లంరాజును అతడి స్నేహితులు బిగ్‌షాట్ అని ముద్దుగా పిలుచుకుంటారని.. దీన్ని బట్టి ఆయన ఏ స్థాయిలో ఉన్నారో ఇట్టే తెలుస్తోంది.

కాకినాడలోనూ అనేక దందాలు

డీఎస్పీగా పదోన్నతి పొందిన ఈయనకు కాకినాడలో పోస్టింగ్ ఇచ్చారు. 2014 నుంచి 2019 వరకు అక్కడ అనేక అక్రమాల భాగోతాలు నడిపినట్లు సమాచారం. అక్కడ సీసీఎస్ డీఎస్పీగా పని చేశారు. విశాల్ గున్నీ ఎస్పీగా ఉన్నప్పుడు క్రికెట్ బెట్టింగ్ కేసులను పల్లంరాజుకు అప్పగించారు. ఆ సమయంలో అక్కడే అదనపు ఎస్పీగా పనిచేసిన రవిశంకర్‌రెడ్డికి విధేయుడిగా మారారు. విశాల్ గున్నీ అప్పగించిన బాధ్యతలతో పల్లంరాజు తనకు తాను ఒక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఏదైనా ఒక కేసును దర్యాప్తు చేస్తున్న అధికారికి సహాయకులుగా ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు ఉంటారు. పల్లంరాజు అనధికారికంగా ఎస్పీ స్పెషల్ పార్టీ పేరుతో ఒక టీంను ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. ఒక క్రికెట్ బుకీని అరెస్టు చేసి వారానికి పైగా రహస్య ప్రదేశంలో ఉంచారని, ఆ బుకీ ద్వారా ఇతర బుకీలకు ఫోన్లు చేయించి కోట్లాది రూపాయలను వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ డబ్బులతోనే విజయవాడకు చెంతనే ఉన్న తాడేపల్లిలో ఖరీదైన స్థలాన్ని కొనుగోలు చేసి మొక్కల ప్రేమికుడిగా మారినట్టు తెలిసింది. ఈ స్థలంలో ఈయన ఒక నర్సరీని నడుపుతున్నట్టు సమాచారం. ఈ స్థలాన్ని ఈయన కొనుగోలు చేయలేదని, ల్యాండ్ సెటిల్‌మెంట్‌లో కానుకగా తీసుకున్నారన్న ప్రచారం కూడా నడుస్తోంది. 2019 తర్వాత కూడా కాకినాడలో పనిచేయాలని పల్లంరాజు భావించారని, అయితే అప్పటి కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఈయన్ను పనికట్టుకుని మరీ బదిలీ చేయించినట్టు తెలిసింది. చంద్రశేఖర్‌రెడ్డికి అనుచరులుగా ఉన్న బుకీలను వేధించి కోట్లాది రూపాయలు వసూలు చేయడమే దీనికి కారణమని సమాచారం.

పిన్నెల్లి అనుచరుడిగా అవతారం

రవిశంకర్‌రెడ్డి పల్నాడు ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయనే స్వయంగా పల్లంరాజును గురజాల డీఎస్పీగా రప్పించుకున్నారని సమాచారం. ఇక్కడికి వచ్చిన తర్వాత పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి అనుచరుడిగా పనిచేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ కారణంగానే హైకోర్టు న్యాయవాది హరిబాబుపై సర్వీసు రివాల్వర్ గురిపెట్టి మరీ ఆయన ఆస్తులు కర్నాటి వీరభద్రరావు పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించినట్టు బాధితుడు ఆరోపిస్తున్నాడు. ఎస్ఐ రబ్బానీ, కానిస్టేబుల్ వెంకటరావు పలుదఫాలుగా హరిబాబు నుంచి రూ.కోటి వరకు వసూలు చేశారని, ఈ డబ్బులను ఈ ముగ్గురు కలిసి పంచుకున్నారని ప్రచారం నడుస్తోంది. కేసు దర్యాప్తు ముందుకు సాగే కొద్దీ ఈ డబ్బుల లెక్కలు తేలడం ఖాయమని అధికారులు చెబుతున్నారు.



ఏపీ బీసీ సంక్షేమ సంఘం రూ.10 లక్షల విరాళం


సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న కేసన శంకరరావు

గుంటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎమ్‌ఆర్‌ఎఫ్)కి రూ.10 లక్షలు అందజేశారు. సచివాలయంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు నేతృత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు రూ.10 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బీసీ సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవితను కలిసి 12 అంశాలతో కూడిన విజ్ఞాపన పత్రాలను అందజేసినట్లు కేసన తెలిపారు. ఎన్నికల హామీ మేరకు చట్టసభల్లో 33 శాతం, స్థానిక సంస్థల్లో 34 శాతం బీసీల రిజర్వేషన్‌లను పునరుద్ధరించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీల లానే బీసీ ఆత్మరక్షణ కోసం చట్టం చేసి వెంటనే అమలు చేయాలని కోరారు. బీసీ బ్యాక్‌లాగ్ పోస్టులను గుర్తించి, వాటిని వెంటనే భర్తీ చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 50 శాతం వాటా ఇవ్వాలని కోరారు. ప్రతి జిల్లాలో రెండు ఎకరాల స్థలం కేటాయించి, రూ.100 కోట్ల బడ్జెట్‌తో బీసీ భవనాల నిర్మాణం మొత్తం 26 జిల్లాల్లో చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అన్నవరపు నాగమల్లేశ్వరరావు, పలువురు నాయకులున్నారు.

వెలుగుల సందడి

(7వ పేజీ తరువాయి)

కొనుగోళ్ల సందడి నెలకొంది. ఇక పూలు, ఇతర పూజా సామగ్రి కొనుగోలుదారులతో మార్కెట్లు కిటకిటలాడాయి. పలువురు ఇళ్లను దీపాలతో అలంకరించుకున్నారు. వ్యాపార కేంద్రాలు, ప్రైవేటు కార్యాలయాలు, పలు ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లు రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగుల్లో నిండిపోయాయి.

- భారీగా పెరిగిన ధరలు

ఈ సారి దీపావళిపై ధరల ప్రభావం అధికంగా ఉంది. గడిచిన రెండేళ్లలో 60 శాతం పెరగగా ఈ ఏడాది మరో 20 శాతానికి పైగా పెరిగాయి. పెరిగిన ధరలతో టపాసులు కాల్చకుండానే పేలిపోతున్నాయి. కిందటేడాది రూ.60 నుంచి 90కి పెరిగిన సాదా కాకరపువ్వొత్తుల ధర ఇప్పుడు ఇంకో ముప్పై రూపాయలు పెరిగింది. భూచక్రాల బాక్సు రూ.260 నుంచి 300కు పెరిగింది. ఒక కిలో రూ.100 ఉండే మతాబాలు ఈ ఏడాది పావు కిలో రూ.100 అయ్యాయి. భారీగా పెరిగిన ధరలతో కొనుగోలుదారులు బెంబేలెత్తిపోతున్నారు. చీరాల సహా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏటా మూడు వందలకు పైగా లైసెన్సుడ్ షాపులు ఉంటాయి. వీటిలో కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుంది. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం రావడంతో దీపావళి ప్రాధాన్యం పెరిగింది. ఆ కారణంగా అనేక మంది కొత్తవారు షాపులు తెరవడానికి పూనుకున్నారు. భారీగా ఉన్న లైసెన్సు ఫీజులను సైతం లెక్క చేయకుండా షాపులు పెట్టారు. రెండు మూడు రోజులుగా వాతావరణం సానుకూలంగానే ఉన్నా బుధవారం మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడింది. బుధవారం సాయంత్రం నుంచి వ్యాపారం జోరుగా సాగుతుందని వ్యాపారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. సరిగ్గా అదే సమయంలో ఒక్కసారిగా వర్షం విరుచుకుపడింది. దీంతో అప్పటి వరకు సాగిన వ్యాపారాలు ఒక్కసారిగా ఆగిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో తాత్కాలికంగా టెంట్లతో ఏర్పాటు చేసుకున్న దుకాణాలు టపాసులకు ఎలాంటి రక్షణ ఇవ్వలేకపోయాయి. దీంతో లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి తెచ్చుకున్న టపాసులు వర్షానికి తడిచిపోవడంతో వ్యాపారులు అల్లాడిపోయారు. వర్షంతో బాణాసంచా వ్యాపారుల గుండెల్లో గుబులు రేకెత్తించింది.

హ్యాండ్‌బాల్ బాలబాలికల రాష్ట్ర జట్ల ఎంపిక

తెనాలి అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): హ్యాండ్‌బాల్ అండర్-14 జాతీయ స్థాయి బాల బాలికల జట్లను హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రకటించింది. తెనాలి డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో మెరుగైన ప్రతిభను కనబరిచిన క్రీడాకారులతో రాష్ట్ర జట్టును ఎంపిక చేశారు. బాలుర జట్టు గుంటూరు జిల్లా నుంచి వల్లెపు హరీష్, ఎలగల అనిల్, పచ్చా కార్తీక్, మాలిశెట్టి విజిష్, చిత్తూరు జిల్లా నుంచి బుక్కి గోవర్ధన నాయక్, బుస్సా సాయినాథ, ప్రకాశం జిల్లా నుంచి యర్రగుంటల దయాసాగర్, మొలకల చిరుత, కృష్ణా జిల్లా నుంచి కడియం సంతోష్, రవిస యేసు, బొమ్మల యశ్వంత్, విజయనగరం జిల్లా నుంచి గురుగువెల్లి సోమశేఖర్, శ్రీకాకుళం నుంచి అరిక చరణ్, నెల్లూరు నుంచి మామిడి గిరీష్, వెస్ట్ గోదావరి నుంచి కుందరపు నాగేంద్ర, కడప నుంచి కాశీనగరి హేమసుందర్ ఎంపికయ్యారు.

బాలికల విభాగంలో..

బాలికల విభాగంలో గుంటూరు జిల్లా నుంచి రమావత్ సింధూర, సంకూరి హదస్సా, విస్సా జువిత, తిరుమలశెట్టి నాగశ్రావ్య, గుండెగ బాలభవ్య, కృష్ణా జిల్లా నుంచి పఠాన్ సఫియా, బావిరెడ్డి జాహ్నవి, ప్రకాశం జిల్లా నుంచి గడ్డం చందు, వాడపల్లి వర్షిత, చిత్తూరు నుంచి మామిళ్ల నిహారిక, మోక్షిత, కర్నూరు నుంచి షహనాజ్, విజయనగరం నుంచి హారిక, కడప జిల్లా నుంచి కావ్య, శ్రీకాకుళం జిల్లా నుంచి ప్రసన్నకుమారి, అనంతపురం జిల్లా నుంచి కొత్తపల్లి శైలజ ఎంపికయ్యారు. ఛత్తీస్‌ఘడ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఈ క్రీడాకారులు రాష్ట్ర జట్టులో పాల్గొంటారు.


హ్యాండ్‌బాల్ బాల బాలికల రాష్ట్ర జట్టు క్రీడాకారులు

పిడుగుపాటుకు వ్యక్తి మృతి


కూనిశెట్టి నారాయణ (పాతచిత్రం)

అచ్చంపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబడిపూడి గ్రామానికి చెందిన కూనిశెట్టి నారాయణ(35) బుధవారం పిడుగుపాటుకు గురై పొలంలో మృతి చెందాడు. రెండు ఎకరాలు గల ఈయన కూలీలతో కలసి పత్తి తీయించేందుకు పొలంలో ఉన్న క్రమంలో సాయంత్రం 4 గంటల సమయంలో వర్షం పడింది. భారీగా వర్షంతోపాటు పిడుగు పడటంతో తీవ్ర గాయాలైన నారాయణ పొలంలోనే మృతి చెందాడు. ఈయనకు కుమార్తె, కుమారుడుతో పాటు భార్య లక్ష్మి ఉంది. మృత దేహాన్ని పొలం నుంచి అంబడిపూడిలోని గృహానికి తరలించారు.

నాగులేరులో గుర్తుతెలియని శవం

దాచేపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని బ్రాహ్మణగడ్డ శివాలయం వెనుకవైపు ప్రవహిస్తున్న నాగులేరులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకురావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. బుధవారం నాగులేరులోని ఇటుకరాళ్ల బట్టీ వైపు నుంచి శివాలయం వైపు మృతదేహం కొట్టుకువచ్చినట్లుగా పోలీసులు తెలిపారు. మృతుడు మెరూన్ కలర్ వైట్ గీతల గళ్లు కలిగిన చొక్కా, లైట్ బ్లూకలర్ నైట్ ప్యాంటు ధరించి ఉన్నాడు. అతని వద్ద ఉన్న బ్యాగ్‌లో చెత్తకాగితాలు ఉన్నట్లు గుర్తించారు. దాచేపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి పేరుతో నకిలీ స్టిక్కర్

- ఇద్దరు అరెస్టు.. కారు సీజ్

రేపల్లె, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నకిలీ ఎమ్మెల్యే స్టిక్కర్‌తో తిరుగుతున్న కారును గుర్తించిన పోలీసులు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, కారును సీజ్ చేసినట్లు పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ విజయవాడకు చెందిన అభినయ్ అనే అతను రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎమ్మెల్యే స్టిక్కర్‌ను విజయవాడలోని స్టిక్కరింగ్ షాపు యజమాని సల్మాన్ వద్ద నకిలీది తయారు చేయించాడు. ఏపీ07డీఎస్8322 నంబరు గల కారుకు ఆ నకిలీ స్టిక్కర్‌ను అతికించుకుని తిరుగుతుండటంతో గుర్తించిన పోలీసులు కారు యజమాని అభినయ్, స్టిక్కర్ తయారు చేసిన సల్మాన్‌ను అరెస్టు చేశారు. కారును సీజ్ చేసి కోర్టుకు పెట్టనున్నట్లు తెలిపారు.నిబంధనలకు విరుద్ధంగా ఎమ్మెల్యేలు, మంత్రుల స్టిక్కర్‌లను డూప్లికేట్ చేసి ఇస్తే స్టిక్కర్ షాపుల యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.


వివరాలు వెల్లడిస్తున్న పట్టణ సీఐ మల్లికార్జునరావు

ఆలయాల్లో ఆభరణాల బాధ్యత అధికారులదే

- దేవదాయ శాఖ గుంటూరు జోన్ ఏసీ, జేవీవో డి.శ్రీనివాసరావు (వాసు)





గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల్లో ఆలయాలకు సంబంధించిన ఆభరణాల బాధ్యత సంబంధిత ఆలయ అధికారులదేనని దేవదాయ ధర్మాదాయ శాఖ గుంటూరు జోన్ అసిస్టెంట్ కమిషనర్, జువెలరీ వెరిఫికేషన్ అధికారి (జేవీవో) డి.శ్రీనివాసరావు (వాసు) తెలిపారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ దాతలు ఆలయాలకు విరాళాలు, వస్తువులు, ఆభరణాలు బహూకరించిన సమయంలో అధికారులచే ధ్రువీకరించిన తగిన రసీదు పొందాలని సూచించారు.

మీ పరిధిలో ఎన్ని ఆలయాలు ఉన్నాయి?

జేవీవో: గుంటూరు జోన్ పరిధిలో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో 6(ఎ), 6(బీ), 6(సీ) క్యాడర్ కింద 600 ఆలయాలు ఉన్నాయి. అన్ని ఆలయాల్లో తనిఖీలు చేస్తూనే ఉంటాం.

ఆలయాల ఆభరణాల రికార్డు ఎప్పుడు పరిశీలిస్తారు?

జేవీవో: ఆలయాలకు సంబంధించిన ఆభరణాల రికార్డును ప్రతి 3 ఏళ్లకు ఒక పర్యాయం పరిశీలన చేస్తాం. రికార్డును ఎప్పటికప్పుడు ఆలయ అధికారులు పూర్తిగా అప్‌డేట్‌లో ఉంచుకోవాలి.

తనిఖీలకు వెళ్లినప్పుడు ఏమి పరిశీలిస్తారు?

జేవీవో: ఆలయాల్లో ఆభరణాల తనిఖీలకు వెళ్లినప్పుడు ఆలయానికి సంబంధించిన అప్రైజర్ రిజిస్టర్, ఇన్వెంటరీ రిజిస్టర్, స్వాధీన రిజిస్టర్, లాకరు, స్ట్రాంగ్ పరిశీలిస్తాం. పూర్తి భద్రతా చర్యలు పాటించాలని అధికారులకు సూచిస్తాం.

అధికారులు బదిలీ అయినప్పుడు రిజిస్టర్ల సంగతేంటి?

జేవీవో: అధికారులు బదిలీ అయినప్పుడు తప్పనిసరిగా రిజిస్టర్లను పరిశీలన చేయాలి. బదిలీ అయిన అధికారి చూపించాలి, బాధ్యతలు చేపట్టే అధికారి వాటిని సరి చూసుకోవాలి.

ఆభరణాల విషయంలో అక్రమాలు జరిగితే?

జేవీవో: ఆలయాలకు సంబంధించిన బంగారం, వెండి వస్తువుల విషయంలో అక్రమాలు జరిగితే దానికి పూర్తి బాధ్యత సంబంధిత ఆలయ అధికారిదే. వీటి లోటుపాట్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకునేలాగా సిఫారసు చేస్తాం.

దీపావళి శుభాకాంక్షలు : మంత్రి అనగాని



రేపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమల్లో భాగంగా మహిళలకు మూడు గ్యాస్ సిలెండర్లు దీపావళి పండగ నుంచి ఉచితంగా అందించనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ పేర్కొన్నారు. దీపావళి పండగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కట్టెల పొయ్యి కష్టాలు తప్పించి గ్యాస్ కనెక్షన్లు ఇప్పించి నేడు ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్‌లను ఇస్తున్నది కూటమి ప్రభుత్వమేనన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ఎప్పుడూ అండగా ఉండటంతోపాటు వారు ఆర్థికంగా బలపడే విధంగా కృషి చేస్తుందన్నారు.

2లోగా ఫిల్మ్ స్టడీస్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

పెదకాకాని, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఫిలిం స్టడీస్ విభాగంలో ప్రవేశాలకు నవంబరు 2ను ఆఖరు తేదీగా నిర్ణయించినట్లు విభాగం కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ జె.మధుబాబు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువతకు ఫిలిం మేకింగ్ పట్ల పూర్తి స్థాయిలో అకడమిక్ నాలెడ్జిని అందించే ఉద్దేశంతో ఆచార్య జినాగార్జున యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ టీవీ అండ్ ఫిలిం స్టడీస్ విభాగం రెండేళ్ల ఎం.ఎ ఫిల్మ్ స్టడీస్ కోర్సు ప్రారంభించిందనీ, ఆసక్తి కల విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 30,774 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద రెండు గేట్ల ద్వారా 44,290 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది. వీటిలో 16 వేల క్యూసెక్కులు పవర్ జనరేషన్ ద్వారా విడుదల అవుతున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	123, 132,142
చికెన్ విత్ స్కిన్	230.00
చికెన్ స్కిన్ లెస్	240.00

36,108 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 29,664 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 36,108 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ అంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 23,835 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	15500
నెంబరు. 5	9500	14000
273	9000	11500
341	9500	16000
4884	9000	13500
సూపర్ 10	10500	13500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18000
బ్యాడిగి	8000	14500
దేవనూరు డీలక్స్	9000	13000
తెల్లకాయలు	5000	11500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	9000	15000
నెంబరు. 5	9500	10000
273	12000	13000
341	9500	16700
4884	--	--
సూపర్ 10	10000	14500
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10900	18300
బ్యాడిగి	9500	14000
దేవనూరు డీలక్స్	11000	11000
తెల్లకాయలు	5000	11000

దీపావళి శుభాకాంక్షలు

● పండుగను సంతోషంగా నిర్వహించుకోవాలని ఎమ్మెల్యేల ఆకాంక్ష

పిడుగురాళ్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కులమతాలకు అతీతంగా ప్రజలందరూ దీపావళి పండుగను జరుపుకుంటారని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. గురజాల నియోజకవర్గ ప్రజలకు, కూటమి నేతలకు ఎమ్మెల్యే యరపతినేని బుధవారం దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆనంద దీపావళి జరుపుకోవాలని ఆకాంక్షించారు.

మాచర్లటౌన్, (ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గ ప్రజలు, కూటమి నేతలు, కార్యకర్తలకు మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి బుధవారం దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ దీపావళి పండుగను కుటుంబసమేతంగా సుఖ సంతోషాలతో క్షేమంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

పెదకూరపాడు,(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటిశ్రీధర్, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌లు బుధవారం వేర్వేరు ప్రకటనల్లో దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి వెలుగుల్లా అందరి కుటుంబాల్లో విరజిమ్మాలని వారు ఆకాంక్షించారు.

సత్తెనపల్లి(ఆంధ్రజ్యోతి) : దీపావళి ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు వైవీ ఆంజనేయులు, యర్రం వెంకటేశ్వరరెడ్డిలు ఆకాంక్షిస్తూ బుధవారం ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియ జేశారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

● స్టాక్ వివరాలు ప్రదర్శించాలని, ఎమ్మార్పీ ధరలకే అమ్మాలని అధికారుల ఆదేశం


ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏవో శ్రీధర్‌రెడ్డి

సత్తెనపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఏవో శ్రీధర్‌రెడ్డి బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. డీలర్లు ప్రతిరోజు స్టాక్ వివరాలను ప్రదర్శించాలని, ఎరువుల నిల్వలను అప్‌డేట్‌ను బోర్డుపై ప్రదర్శించాలన్నారు. అమ్మకాలు జరిపే ఎరువులను ఈపాస్ మిషన్ నందు ప్రతి రోజు అప్‌డేట్ చేయాలని సూచించారు. ఎరువుల భౌతికనిల్వలు, ఈ పాస్‌మిషన్ ఆన్‌లైన్‌నిల్వలు ప్రతి రోజు సరిపోల్చుకోవాలన్నారు. ఎరువులు అధిక ధరలకు విక్రయించినా, కృతిమ కొరత సృష్టించినా అటువంటి డీలర్లపై శాఖపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. లైసెన్స్ కూడా రద్దు చేస్తామన్నారు. డీలర్లు రైతులకు ఎరువులు అమ్మకాలు జరిపేటప్పుడు తప్పనిస రిగా బిల్లుపై రైతు ఫోన్ నెంబర్ పూర్తి వివరాలు నమోదు చేయాలని న్నారు.

హైదరాబాద్‌కు కొత్త సర్వీసులు నడపాలి

సత్తెనపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సర్వీసు బస్సు బాగా పాడైపోయిందని కొత్త సర్వీసులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో భాగంగా బుధవారం డిపో మేనేజర్ విజయకుమార్‌ను కోరారు. సత్తెనపల్లి నుంచి తిరుపతి వెళ్లే బస్సు సర్వీసు కూడా బాగా పాతబడిపోయిందని కొత్త సర్వీసును ఏర్పాటు చేయాలని మరో ప్రయాణికుడు కోరారు. త్వరలో హైదరాబాద్, తిరుపతికి కొత్త సర్వీసులు ఏర్పాటు చేస్తామని డీఎం తెలియజేశారు. సత్తెనపల్లి నుంచి అచ్చంపేటవరకు నడిపే బస్సు సర్వీసులను సమయం ప్రకారం నడపాలని, దొడ్లేరు వరకువచ్చే బస్సు సర్వీసును నిండుజర్ల వరకు పొడిగించాలని కోరారు.

పత్తిని కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మాలి

● పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో రామమ్మ

మాచవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో పత్తిని అమ్ముకోవాలని ఏవో రామమ్మ రైతులకు సూచించారు. మండలంలోని పిల్లుట్ల, సింగరాయపాలెం తండా గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రామమ్మ మాట్లాడుతూ పిడుగురాళ్ళలోనే లక్ష్మీగణపతి కాటన్ మిల్లు, అమరలింగేశ్వర ఎంటర్ ప్రైజెస్ జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అక్కడ పత్తి అమ్ముకుంటే క్వింటాకు ప్రభుత్వ మద్దతు ధర. 7521 లభిస్తుందని తెలిపారు. తేమ శాతం ఆధారంగా ధర నిర్ణయిస్తారని తెలిపారు. దళారులను నమ్మి మోసపోకండని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉద్యాన, వ్యవసాయ సహాయకులు కే.నరసింహా నాయక్, యాకోబు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



కార్తీకమాస ఏర్పాట్లపై సమీక్ష

● పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రాల్లో ప్రసిద్ధమైన బాలచాముండికా సమేత అమరేశ్వరాలయం సందర్శించే భక్తులకు మెరుగైన ఏర్పాట్లు కల్పించేందుకు బుధవారం దేవస్థాన కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి పి.సునీల్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. నవంబరు 1 నుంచి ప్రారంభంకానున్న కార్తీకమాసంలో అమరేశ్వరాలయం సందర్శించే భక్తులకు స్వామి దర్శనం సక్రమంగా జరిగేలా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేసే సమయాల్లో భద్రతా చర్యలు, భక్తులు వచ్చే వాహనాలకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడటం, క్యూలలో మంచినీటి సరపరా, ప్రసాదాల పంపిణీ, పారిశుధ్య నిర్వాహణ తది తర అంశాలపై చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో పార్వతి, సీఐ ఎం.శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో ఏఈ పీ.రవికిరణ్, మత్యశాఖ, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో సూచనలు చేస్తున్న కమిషనర్ వేణుబాబు

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

● మున్సిపల్ కమిషనర్ వేణుబాబు

మాచర్లటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో విషజ్వరాలు ప్రబలకుండా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మున్సిపల్ కమిషనర్ వేణుబాబు అన్నారు. పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో సచివాలయాల కార్యదర్శులు, ఏఎన్‌ఎంలతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఏఎన్‌ఎంలు ఇంటింటి సర్వే చేపట్టి జ్వర పీడితులను గుర్తించాలన్నారు. జ్వరాలు ప్రబలుతున్న ప్రాంతాల్లో పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు. నీటి శాంపిల్స్ సేకరించాలన్నారు. ఈ సమావేశంలో సచివాలయాల కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.





మద్యం కేసులో ముగ్గురికి రిమాండ్

బెల్లంకొండ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణా మద్యం కలిగివున్న కేసులో ముగ్గురికి రిమాండ్ పడటన్లు ఎక్సైజ్ సీఐ తులసి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలం లోని వెంకటాయపాలెంలో తెలంగాణా మద్యం విక్ర యిస్తున్నారనే సమాచారం వచ్చిందని, గ్రామానికి వెళ్లి తనిఖీ చేయగా బాణా బద్రునాయక్, భూక్యా శివరామకృష్ణనాయక్, రూపావత్ రాజానాయక్‌లు తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ మద్యాన్ని అక్రమంగా కలిగివున్నందుకు గానూ అదుపులోకి తీసుకొని సత్తెనపల్లి కోర్టులో హాజరుపరిచినట్లు జడ్జి రిమాండ్ విధించినట్లు తెలిపారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎన్ కోటేశ్వరరావు, ఎస్‌ఐ ఎన్ శ్రీనివాసరావు, క్రోసూరు ఎక్సైజ్ ఎస్‌ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు

క్రోసూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): క్రోసూరు పీహెచ్‌సీ ఆధ్వ ర్యంలో బుధవారం సానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందు లు పంపిణీ చేశారు. సీజనల్‌గా వచ్చే వ్యాధులపై వైద్యాధికారి డాక్టర్ ధనుష్ అవగాహన కల్పించారు. కార్య క్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్, సూపర్‌వైజర్ సాంబశివరావు, పాఠశాల ప్రిన్సిపాల్ ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు.

వరి పైరులో పాము పొడ తెగులు

నకరికల్లు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వరిలో పాము పొడ తెగులు ఉన్నట్టు వ్యవసాయ అధికారులు గుర్తించారు. బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా నకరికల్లు, శివాపురం తండా గ్రామంలో వరి పొలాలను ఏవో కే దేవదాసు పరిశీలించారు. పాము పొడ తెగులు నివారణ చర్యలు సూచించారు. కార్య క్రమంలో ఎస్‌కే సుభానీ, వై ప్రభాకర్, జీ సూర్యప్రకాష్‌లు పాల్గొన్నారు.







ట్రాఫిక్‌ను నియంత్రించండి

పిడుగురాళ్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనాలు ఎక్కడ పడితే అక్కడ నిలుపుదల చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్ గర్రె నాగేశ్వరరావు తెలిపారు. మున్సిపల్ సాధారణ సమావేశం బుధవారం చైర్‌పర్సన్ కొత్త వెంకట సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. ఆయుష్ వైద్యాధికారి గత పదినెలలుగా బదిలీ అయ్యారని, ఇప్పటి వరకు కొత్త వైద్యాధికారిని నియమించలేదని, ఇప్పటికైనా కొత్త వైద్యుడిని అందుబాటులోకి తీసుకురావాలని కౌన్సిలర్ కొక్కెర శ్రీనివాసరావు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. బీసీ శ్మశాన వాటిక అధ్వానంగా ఉందని, మరమ్మతులు నిర్వహించాలని కౌన్సిలర్ ముక్కంటి, కో-ఆప్షన్ సభ్యులు పూర్ణ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకొచ్చారు. వాసవి నగర్, ఎస్టీ కాలనీ, వడ్డెర కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, నివాస గృహాల మీదుగా వెళ్తున్న విద్యుత్ వైర్లను తొలగించాలని కోరుతూ 23వ వార్డు కౌన్సిలర్ జూలకంటి శ్రీరంగరజని చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేశారు. చైర్‌పర్సన్ కెవి సుబ్బారావు, కమిషనర్ పి.శ్రీధర్ మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి పనులకు కొంత నిధులు రావాల్సి ఉందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కేవీ సుబ్బారావు, కమిషనర్ శ్రీధర్ తదితరులు

ఆక్రమణలు తొలగించాలి

● మున్సిపల్ కమిషనర్‌కు ఎమ్మెల్యే ఆదేశాలు



సమావేశంలో సూచనలు చేస్తున్న కమిషనర్ వేణుబాబు

సత్తెనపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఉన్న అన్ని ఆక్రమణలను తొలగించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్మన్ చలంచర్ల లక్ష్మీతులసి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పాల్గొన్న 7వ వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ మాట్లాడుతూ తన వార్డు పరిధిలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు ఎక్కువయ్యాయని సమావేశంలో అధికారుల దృష్టికి తెచ్చారు. దీనిపై కమిషనర్ షమ్మి మాట్లాడుతూ ఇప్పటికే పలు చోట్ల అక్రమణలను తొలగింప చేశామన్నారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పట్టణంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి షెడ్లు ఏర్పాటు చేస్తే వెంటనే తొలగిం చాలని కమిషనర్‌ను ఆదేశించారు. వెంటనే ఆక్రమణలు తొలగిస్తామని కమిషనర్ తెలిపారు. పట్టణంలో అర్హులైన వారందరినీ ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటర్లుగా నమోదయ్యేలా చూడాలని కౌన్సిలర్లను మేరీ గ్రేస్ కోరారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యపై కూడా దృష్టి సారించాలన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు నాగుల్ మీరా, కంభంపాటి అబ్రహం, జానీ బాషా, గుజ్జర్లపూడి సతీష్, అచ్యుత శివప్రసాదు, కూకుట్ల లక్ష్మి, పెద్దింటి గోవిందమ్మ, శెట్టి ఆనంద్ పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు కన్నా లక్ష్మీనారాయణ బూట్లు, డ్రెస్, గ్లౌజులు ఇతర పరికరాల కిట్టును అందించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పట్టణంలోని పాత కూరగాయల మార్కెట్‌లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కన్నా బుధవారం శంకు స్థాపన చేశారు. రూ.38.50 లక్షలతో కాంపౌండ్‌వాల్ నిర్మాణం, ప్లాట్‌ఫాం నిర్మాణం, రెయిలింగ్ వంటి అభివృద్ధి పనులు జరుగుతాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ షమ్మి, చైర్మన్ లక్ష్మీతులసీ, మాజీ చైర్మన్ ఎలినేడి రామస్వామి, కౌన్సిలర్లు తురగ మేరీ గ్రేస్, పెద్దింటి గోవిందమ్మ, కంభంపాటి అబ్రహం, చౌట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



శంకు స్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కన్నా



నరసింగపాడులో అన్నపూర్ణాదేవికి పూజలు చేస్తున్న మహిళలు

నరసింగపాడులో మాస శివరాత్రి పూజలు

నకరికల్లు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మాస శివరాత్రిని పురస్క రించుకొని బుధవారం నరసింగపాడులోని గంగా అన్నపూర్ణ సమేత మరకత లింగ చంద్రమౌళేశ్వర స్వామి దేవాలయంలో అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చండీ, రుద్రహోమాలు నిర్వహించారు. అన్నపూర్ణా దేవిని ప్రత్యేకంగా అలంకరించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త పమిడి శ్రీనివాసశర్మ నిర్వహించారు.

మల్లేశ్వరునికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం

గుండ్లపల్లిలో ఉన్న భ్రమ రాంభ సమేత మల్లేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం మాస శివరాత్రిని పురస్కరించుకొని మల్లేశ్వర స్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. అనంతరం స్వామి వారిని విశేషంగా అలంకరించారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో అధికసంఖ్యలో పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

క్రోసూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు సర్కిల్ పరిధిలోని మూడు మండలాల్లో అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని పెదకూరపాడు సీఐ పత్తి పాటి సురేష్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. సర్కిల్ పరిధిలోని పెదకూరపాడు, క్రోసూరు, బెల్లంకొండ మండలాల్లో తప్ప నిసరిగా పోలీసుశాఖ, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ నుంచి దుకాణాల ఏర్పాటు కోసం అనుమతులు పొందాలన్నారు. సరైన భద్రతా ప్రమాణాలు పాటించకుండా దుకాణాలు ఏర్పాటు చేసినా, విక్రయాలు జరిపినా, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

మాచవరం, (ఆంధ్రజ్యోతి) : అనుమతులు ఉన్న వారు మాత్రమే దీపావళి మందులు విక్రయించాలని ఎస్ఐ సతీష్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకొని విక్రయ కేంద్రాల వద్ద సేఫ్టీ వసతులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు

పిడుగురాళ్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని జానపాడు గ్రామంలో అనధికారికంగా మద్యం బాటిల్స్ కలిగి ఉండటంపై ఇద్దరిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ శాఖ సీఐ కె.కర్ణ తెలిపారు. జానపాడుకు చెందిన పేరం నరసింహారావు, షేక్ సలాం వద్ద అనధికారికంగా మద్యం బాటిల్స్ కలిగి ఉండగా కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

దస్తావేజులు పోయినవి

మోర్తాల మధుసూదన్ రెడ్డి S/o. కోటిరెడ్డి, కోలగుట్ల గ్రామం, దుర్గి మండలం, పల్నాడు జిల్లా.
(1) దస్తావేజు నెంబర్ : **1978/2021**, విస్తీర్ణం : **1-85.** (2) దస్తావేజు నెంబర్ : **1979/2021**, విస్తీర్ణం : **1-32.** (3) దస్తావేజు నెంబర్ : **1889/2021**, విస్తీర్ణం : **0-32, 3-49** కొలగుట్ల గ్రామ డి.నెం: 596-1-66, 595/1-1-35, 595-0.16, **594-1-0.14, 595/1-1-0.03, 595-2-0.16, 594-1-0.14, 595/1-1-0.03, 594-0.15.**
(2) పెద్దిటి స్వప్నరెడ్డి W/o. మోర్తాల మధుసూదన్‌రెడ్డి, కొలగుట్ల గ్రామం, దుర్గి మండలం, పల్నాడు జిల్లా, దస్తావేజు నెంబర్: **1836/2021**, విస్తీర్ణం : **3-14**, కొలగుట్ల గ్రామ డి.నెం : **596-1.** పై తెలుపబడిన ఒరిజినల్ దస్తావేజులు పోయినవి. దస్తావేజులు ఎవరికైనా దొరికినచో ఈ క్రింది నెంబర్‌కు ఫోన్ చేయగలరు. (సమాచారం తెలపిన వారికి తగిన పారితోషం ఇవ్వబడును)
ఫోన్ నెంబర్ : 986667774



దాచేపల్లి నగర పంచాయతీ సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అప్పారావు

ఎమ్మెల్యే యరపతినేనికి ధన్యవాదాలు

దాచేపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీలోని అంజనాపురం కాలనీకి తాగునీటి వాటర్ ట్యాంక్ నిర్మాణానికి రూ.25 లక్షల నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు నగర పంచాయతీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. దాచేపల్లి సచివాలయం-1లో నగర పంచాయతీ సాధారణ సమావేశం బుధవారం జరిగింది. సమావేశానికి చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ అధ్యక్షత వహించారు. అంజనాపురం కాలనీలో అతిసార కేసులు నమోదుకాకుండా రేయింబవళ్లు పనిచేసిన కమిషనర్, పారిశుధ్య కార్మికులకు, పీహెచ్‌సీ వైద్యులు, హెల్త్ సిబ్బందికి, ఆశ వర్కర్లకు కౌన్సిల్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో చర్చించిన సాధారణ అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు.

రామప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

మాచర్ల టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామప్ప దేవాలయంలో బుధవారం మాస శివరాత్రిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి వారిని పంచామృతాభిషేకాలతో అభిషేకించి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అనంతరం హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కంభంపాటి యలమంద, తుమ్మేపల్లి సత్యనారాయణ, అంకేశ్వరరావు, పోలిశెట్టి చంద్రశేఖరరావు, లింగేశ్వరరావు, షరాబు వెంకటరత్నం, మంగమ్మ, విడేల వెంకటేశ్వర్లు, ఓబులశెట్టి మంత్రయ్య, కొత్తమాసు మాధవరావు, దారివేముల రామారావు, కొత్త సుబ్రహ్మణ్యం,కుమారి, మురళి, వాసు, ఉషారాణి పాల్గొన్నారు.



నారా భువనేశ్వరితో శేరెడ్డి మంజుల

నారా భువనేశ్వరిని కలిసిన మంజుల

రెంటచింతల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెంటాలకు చెందిన శేరెడ్డి కోటిరెడ్డి, ఆయన సతీమణి మంజుల బుధవారం ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని కలిశారు. ఈ యేడాది మే 13వ తేదీన జరిగిన ఎన్నికల్లో వైసీపీ నేతలు మంజులను తీవ్రంగా గాయపరిచారు. ఆ ఘటన తనను ఎంతో కలిచి వేసిందని భువనేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మంజుల కుటుంబ సభ్యుల యోగక్షేమాలను ఆమె అడిగి తెలుసుకున్నారు.

పంపుహౌస్‌ను పరిశీలించిన కమిషనర్

పిడుగురాళ్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి కుళాయిల ద్వారా మంచినీటిని అందించే పంపుహౌస్‌ను బుధవారం ఉదయం మున్సిపల్ కమిషనర్ పి.శ్రీధర్ పరిశీలించారు. నీటిని పరిశుభ్రంగా ఉంచాలని, ఎక్కడా కూడా లీకేజిలు ఏర్పడకుండా చూడాల్సిన బాధ్యత ఇంజనీరింగ్, నీటి విభాగం సిబ్బందిపై ఉందన్నారు. అంతేకాకుండా 33 వార్డుల్లో పైపులైన్‌ను పరిశీలించాలని, లీకేజీలను అరికట్టాలని సిబ్బందికి సూచించారు.

ఢిల్లీ వేడుకలకు వైహెచ్‌కే మోహన్‌రావు

పిడుగురాళ్ల, అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి): దేశ రాజధాని ఢిల్లీ ఆంధ్రాభవన్‌లో నవంబరు 1న ఏపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్న రాష్ట్ర అవతరణ ఉత్సవాలలో భాగంగా జయహో... జయ జయహో... జననీ శుభమస్తు... విజయోస్తు అంటూ సాగే కార్యక్రమంలో పిడుగురాళ్లకు చెందిన వైహెచ్‌కే మోహన్‌రావు రచించిన ఆంధ్రావనికి చోటు లభించింది. రాష్ట్ర ప్రాశస్త్యాన్ని ఆవిష్కరించే వివిధ అంశాల రేఖా మాత్రంగా ఈ గీతం ప్రతిఫలిస్తుంది. అమరావతి సాంస్కృతిక చైతన్యవేదిక కన్వీనర్ పీవీ రమణ గీతానికి సంగీతం సమకూర్చి తన బృందంతో కలిసి ఆలపిస్తారని మోహన్‌రావు తెలిపారు.

గడ్డి వామి దగ్ధం

నకరికల్లు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో బత్తుల జానకిరామయ్యకు చెందిన సుమారు పది ఎకరాల గడ్డి వామి మంగళవారం రాత్రి 11:30 గంటల సమయంలో దగ్ధ మైంది. గడ్డి వామి దగ్ధమవుతుండగా చూసిన ఒక మహిళ జానకి రామయ్యకు సమాచారం అందించటంతో వెళ్లి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక దళ సిబ్బంది మంటలను అదుపు చేశారు. కానీ అప్పటికే పూర్తి భాగం వామి దగ్ధమైపోయింది. గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి వామికి నిప్పంటించినట్లు అనుమానిస్తున్నారు. లక్షకు పైగా ఆస్తి నష్టం సంభవించి ఉంటుందని అంచనా.

నెమలిపురిలో 'పొలం పిలుస్తోంది'

● వరి పైరును పరిశీలించిన వ్యవసాయశాఖ అధికారులు

రాజుపాలెం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెమలిపురి గ్రామంలో వరి పైరును జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ శివకుమారి, మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటనరసయ్య తదితరులు పరిశీలించారు. ఏవో వెంకటనరసయ్య మాట్లాడుతూ రబీ పంటల బీమా పథకా నికి సంబంధించి రైతులు ఎకరాకు రూ.630 ప్రీమియాన్ని చెల్లించాలని, డిసెం బరు 15 వరకు గడువు ఉందన్నారు. కార్యక్రమంలో వీఏఏఎస్ ముస్తాక్, భవాని, గంగవరపు రామలక్ష్మణరావు, బెల్లంకొండ వాసు, నరసింహరావు, వర్ల శ్రీను ఉన్నారు.



నకరికల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న హైస్కూల్ విద్యార్థులు

పర్యావరరణ హితంగా పండుగ చేద్దాం

● నకరికల్లు జడ్పీ హైస్కూల్ విద్యార్థుల ర్యాలీ

నకరికల్లు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హాని కలగని రీతిలో దీపావళి పండుగను నిర్వహించుకోవాలని నకరికల్లు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం తుర్లపాటి నగేష్ సూచించారు. బుధవారం హైస్కూల్ విద్యార్థులతో నకరికల్లులో ర్యాలీ నిర్వహించారు. ధ్వని కాలుష్యం కలిగించే చీమ టపాసులు వద్దు, మట్టి ప్రమిదలు ముద్దు అని విద్యార్థులు నినాదాలు చేశారు. ర్యాలీలో ఫిజికల్ డైరెక్టర్ చింతా పుల్లయ్య, బయాలజీ అసిస్టెంట్ సువర్ణరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటిని గెలిపించాలి

క్రోసూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య కోరారు. బుధవారం ఆయన క్రోసూరులో ఓట్ల దరఖాస్తు లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు పట్టభద్రులను కలసి ఆలపాటిని గెలిపించాలని కోరారు. ఓటరుగా నమోదు కావ టానికి 6వ తేదీ గడువు ఉందని, 2021 నాటికి డిగ్రీ పూర్తి చేసుకున్న వారందరూ ఓటరుగా నమోదు కావటానికి అర్హులన్నారు. ప్రచార కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లాల రామాంజనేయులు, దుద్దుల యోహాన్, అనుముల వెంకట రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఓటు దరఖాస్తు అందజేస్తున్నటీడీపీ నేతలు

టీడీపీ నేత నాగరాజు మృతి బాధాకరం

బెల్లంకొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన బత్తుల నాగరాజు మృతి బాధాకర మని మండల కోర్ కమిటీ సభ్యుడు వెన్నా సీతారామిరెడ్డి తెలిపారు. రెండురోజుల క్రితం పిడుగురాళ్ళ సమీపంలో బస్సు యాక్సిడెంట్‌లో నాగరాజు మృతిచెందగా బుధవారం నాగిరెడ్డిపాలెంలో నాగరాజు మృత దేహాన్ని పలువురు సందర్శించి నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగరాజు తెలుగుదే శం పార్టీకి చేసిన సేవల గురించి ఆయన మాట్లాడారు. అనంతరం మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5వేలు నగదును కుటుంబ సభ్యులకు అందజేయటం జరిగింది. అనంతరం కుటుంబసభ్యులకు సంతాపం ప్రకటించారు.

ఆకు ముడత పురుగుతో అప్రమత్తంగా ఉండాలి

● మండల వ్యవసాయాధికారి వేణుగోపాల్

క్రోసూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆకు ముడత పురుగు ప్రస్తుతం మాగాణి పంటల్లో ఆశించి ఉందని, సస్యరక్షణ చర్యలు చేపట్టి రైతులు పంటలను కాపాడుకోవాలని మండల వ్యవసాయ అధికారి వీ వేణుగోపాల్ అన్నారు. బుధవారం బయ్యవరం, ఊటుకూ రు గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రెండు గ్రామాల్లోను మాగాణి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ పంటల బీమా పథకంలో చేరే రైతులు ఎకరాకు రూ.630 ప్రీమియాన్ని చెల్లించాలని, డిసెంబరు 15 వరకు గడువు ఉందన్నారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది గ్రేస్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యుదుత్పత్తిపై విద్యార్థులకు అవగాహన

రెంటచింతల, అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి) : నీటి ద్వారా విద్యుత్‌ను ఎలా తయారు చేస్తారనే అంశంపై ఏపీ జెన్కో డిప్యూటీ ఈఈ మహ్మద్ బుధవారం మోడల్ స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. తొలుతఎంసీఆర్(మెయిన్ కంట్రోల్ రూమ్‌ను) పని చేసే విధానం, రెండు టర్బయిన్ల ద్వారా కరెంట్ తయారీ, టేల్ రేస్ ఛానల్ ద్వారా నీటి ప్రవాహం తదితర అంశాలను గురించి వివరించారు. డ్యాం పరిసరాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.పాపయ్య, ఐటీ అండ్ ఐటీఈఎస్ వృత్తి విద్యా జిల్లా సమన్వయ కర్త అయ్యప్ప స్వామి, వెంకట్రామయ్య, విద్యాసాగర్, జబీన, కుమార్, అలేఖ్య, శ్రీధర్, ఆంజనేయులు, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.



మెయిన్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

హాస్టళ్లలో మెనూ పాటించకపోతే చర్యలు

● వసతి గృహాల వార్డెన్లకు కలెక్టర్ హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట కల్చరల్, అక్టోబరు, 30: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో ప్రభుత్వ నిబంధనల మేరకు మెనూ పాటించాలని, మెనూను అతిక్రమించిన వారిపై క్రమశిక్షణ చర్యలు, క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్ లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక హాలులో సాంఘిక, వెనుకబడిన తరగతుల, గిరిజన సంక్షేమ వసతి గృహాల నిర్వహణపై సంబంధిత వార్డెన్లు, ప్రిన్సిపాల్స్‌తో ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతు వసతి గృహాలలో మరుగు దొడ్ల నిర్వహణ సక్రమంగా, పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. వసతి గృహాలలో విద్యార్థుల తో పనులు చేయించరాదన్నారు. బాలికల వసతి గృహాలలో ప్రహరీ, ఫెన్సింగ్ తప్పనిసరిగా ఉండాలన్నారు. సమావేశంలో సాంఘిక సంక్షేమశాఖ అధికారి ఓబుల నాయుడు, వెనుకబడిన తరగతుల అధికారి నాగేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖాధికారి వరలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల జిల్లా సమన్వయ అధికారి పద్మజ తదితరులు పాల్గొన్నారు.

దీపావళిని ఆనందంగా జరుపుకోండి: ఎస్పీ

నరసరావుపేట లీగల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను కుటుంబ సభ్యులతో దీపాల పండుగగా ఆనందంగా జరుపుకోవాలని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు కోరారు. ఈ సందర్భంగా ఆయన బాణ సంచా విక్రేతలకు పలు సూచనలు చేశారు. బాణ సంచా విక్రయించే దుకాణాలు, తయారీ కేంద్రాలు, నిల్వ చేసే గోడౌన్‌లకు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి ఉండాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాణ సంచా అక్రమ విక్రయాలు, నిల్వలకు సంబంధించిన సమాచారం ఉంటే డయల్ 100, 112లో నెంబర్లకు సమాచారం అందించాలన్నారు.

గీతాంజలి పాఠశాలలో దీపావళి సంబరాలు

వినుకొండ టౌన్, అక్టో బరు 30 (ఆంధ్రజ్యోతి) పట్టణంలోని గీతాంజలి పాఠశాలలో దీపావళి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వై.ఎల్ కిశోర్, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



దీపావళి వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

● వినుకొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వినుకొండ బోసుబొమ్మ సెంటర్‌లో శ్రీవాసవి కల్యాణ మండపంలో బుధవారం విశ్వహిందూ మహా సంఘం భారత్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లాస్థాయి హైందవ ధర్మభజన సత్సంగం మండలి సమ్మేళనం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జీవీ అంజనేయులు పాల్గొన్నారు

● చిలకలూరిపేట అర్బన్: పట్టణంలోని కళామందిర్ సెంటర్‌లో పిరమలై కల్లర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రామలింగం పేవర్ జయంతి, వర్ధంతి జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొని ఘనంగా నివాళి అర్పించారు.

● నాదెండ్ల: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం, బుక్కాపురం గ్రామాల్లో రూ 10 లక్షలు అంచనా వ్యయంతో నిర్మించనున్న సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి బుధవారం శంకుస్థాపనలు చేశారు.

● నరసరావుపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకొని నరసరావుపేటలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో బాణసంచా స్టాల్స్ నిర్వహిస్తున్నారు.

● చిలకలూరిపేట: చిలకలూరిపేట సీఆర్ క్లబ్‌లో అర్బన్ పోలీసులు మంగళవారం రాత్రి, బుధవారం మధ్యాహ్నం తనిఖీలు చేశారు.

● చిలకలూరిపేట అర్బన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా టి శివరామకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

● జాతీయ రహదారి పక్కన చిలకలూరిపేట బొప్పూడి మధ్య పెద్ద సంఖ్యలో ఉన్న బాణాసంచా దుకాణాలు కొన్నింటిలో గుంటూరుకు చెందిన జీఎస్టీ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు జరిపారు. ప్రభుత్వానికి రావలసిన ఆదాయానికి గండి కొడుతున్న వారిని గుర్తించినట్లు సమాచారం.

● చిలకలూరిపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం ఛైర్మన్ షేక్ రఫాని అధ్యక్షతన జరిగింది. ఎజెండాలో ఉన్న మొత్తం 22 అంశాలను ఆమోదిస్తూ తీర్మానించారు.

● జాలాది (యడ్లపాడు): రీ సర్వేలో వచ్చిన భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విజయశ్రీ పేర్కొన్నారు. మండలంలోని జాలాది, జగ్గాపురం గ్రామాలలో బుధవారం భూ సమస్యల పరిష్కార కార్యక్రమం జరిగింది. జాలాదిలో 26 అర్జీలు రాగా జగ్గాపురంలో 10 అర్జీలు వచ్చాయి.

● నరసరావుపేట టౌన్: వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు పోట్లూరి నవీన్, ఆవుల భూమిక ఖో-ఖో పోటీల స్టేట్‌టీమ్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు తెలిపారు.

● రొంపిచర్ల: రొంపిచర్ల జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు చిత్రదీపిక, బాలకృష్ణ ఉమ్మడి గుంటూరు జిల్లా సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికైనట్టు హెచ్ఎం సుభానీ బుధవారం తెలిపారు.

● రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో మంగళవారం రాత్రి కారు ఢీకొని లింగంగుంట్ల వెంకటేశ్వర్లు (60) మృతిచెందాడు. మృతుడు నరసరావుపేటలోని ఒక ప్రైవేట్ కళాశాల బస్సులో క్లీనర్‌గా పని చేస్తుంటాడు.

● వినుకొండ టౌన్: పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ స్థానిక ఎన్ఎస్‌పీ కాలనీలోని కస్తూర్భాగాంధీ బాలికల గురుకుల పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీచేశారు. పాఠశాల ఆవరణ అపరిశుభ్రంగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు.

● వినుకొండ టౌన్: మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ దస్తగిరి అధ్యక్షతన బుధవారం సాధారణ సమావేశం నిర్వహించారు. ఏపీ మున్సిపాల్టీ చట్టం 1965 సంవత్సరం సెక్షన్ 263 ప్రకారం డీఅండ్‌వో ట్రేడ్ లైసున్సు ఫీజుల వసూలుకు మున్సిపల్ కౌన్సిలర్లు ముక్తకంఠంతో వ్యతిరేకించారు.

● శావల్యాపురం: రైల్వేస్టేషన్ మార్గంలో ఆక్రమణలతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, ఆక్రమణలను తొలగించాలని శావల్యాపురం మండల సీపీఎం ప్రధాన కార్యదర్శి కేవీఆర్ మోహన్‌చంద్ బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ లేళ్ళ లోకేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందజేశారు.

● శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి సమీపంలోని సంసిద్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి నాసరయ్య పరుగుపందెంలో రెండు బంగారు పతకాలను సాధించి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం నాగసురేష్ తెలిపారు.

● శావల్యాపురం: మండలంలోని వేల్పూరు జడ్పీ పాఠశాలకు చెందిన బొల్లా షణ్ముఖ్‌నాథ్‌కుమార్, మర్రి వెంకటశ్రీవల్లిలు రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలకు ఉమ్మడిగుంటూరు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం మహబూబ్ సుభానీ తెలిపారు.

● నాదెండ్ల: మండలంలోని గణపవరం గ్రామంలో కాలుష్య రహిత దీపావళి సంబరాలను బుధవారం నిర్వహించారు. చిలకలూరిపేట పట్టణంలోని చైతన్య లిటిల్స్ విద్యార్థులు నాటక రూపంలో కాలుష్య రహిత దీపావళిపై అవగాహన కల్పించారు.

● చిలకలూరిపేట: ఏఎంజీ సంస్థ ప్రాంగణంలో జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్‌లో జిల్లా జట్ల ఎంపికలకు బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి 256 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అండర్-14 విభాగంలో 12మంది బాలికలు, 12 మంది బాలురు, అండర్-17 విభాగంలో 12మంది బాల బాలికలను ఎంపిక చేశారు.

● నరసరావుపేట లీగల్: పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా గురువారం ఉదయం 6:30 గంటలకు ఎస్పీ కార్యాలయంలో రెండు కిలో మీటర్ల పరుగును ఏక్తాదివస్ పేరుతో నిర్వహించనున్నట్టు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు.

● ఈపూరు: ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని మండల వ్యవసాయాధికారి ఆర్.రామారావు అన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో బుధవారం మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏవో మాట్లాడుతూ అనుమతి లేకుండా బయోమందులు విక్రయిస్తే చర్యలు ఉంటాయన్నారు.


● పిచికలపాలెం (శావల్యాపురం): పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఈవో పూరేటి అశోక అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని పిచికలపాలెం గ్రామంలో వరిపంటను వ్యవసాయశాఖాధికారులు బుధవారం పరిశీలించి తెగుళ్ల నివారణకు పలు సూచనలు చేశారు.

● శావల్యాపురం: మండలంలోని 11గ్రామసచివాలయాల పరిధిలో నవంబరు నెలకు గాను 5889మంది లబ్దిదారులకు రూ.2,49,44,500లను పింఛన్లు అందజేయనున్నట్లు ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య తెలిపారు. నవంబరు 1వతేదీన ఉదయం 6గంటల నుంచి ఆయా సచివాలయాల ఉద్యోగుల ద్వారా పింఛన్‌లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

● ఈపూరు: యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడి పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి రామారావు అన్నారు. మండలంలోని బొగ్గరం, కొండాయిపాలెం గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సాగుచేసిన వరి పైరును పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవో బండి అప్పారావు, గణేష్, రైతులు పాల్గొన్నారు.

ఆలయాలకు కార్తీక శోభ





కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి మూల విరాట్

పల్నాడుజిల్లా నరసరావుపేట సమీపంలోని ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి సన్నిధి, పంచారామాలలో ప్రథమ ఆరామంగా, దక్షిణకాశీ పుణ్యతీర్థంగా భక్తులచే పూజలందుకుంటున్న అమరావతిలోని అమరేశ్వరస్వామి దేవస్థానం, గుంటూరు జిల్లా, పెదకాకాని మండల కేంద్రంలోని శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానాల్లో శనివారం నుంచి కార్తీకమాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఆయా ఆలయాలు కార్తీకమాస వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబతున్నాయి. అధికారులు, నిర్వాహకులు ఆలయానికి తరలి వచ్చే భక్తుల కోసం ఆయా ప్రాంతాల్లో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. త్రికోటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసంలో స్వామివారికి అభిషేకం చేయటం వలన సర్వదోష నివారణ, సర్వ కార్యసిద్ధి జరుగుతుందని భక్తుల విశ్వాసం. అలాగే కాకాని మల్లేశ్వరుడు కోరిన వరాలు ఇచ్చే దేవుడుగా, అభిషేక ప్రియుడిగా నిత్య పూజలు అందుకోనున్నారు.

- శనివారం నుంచి కార్తీకమాసం ప్రారంభం
- వేడుకలకు ముస్తాబవుతోన్న ఆలయాలు
- కోటప్పకొండలో కార్తీక మాస పథకానికి విశేష స్పందన
- కాకానిలో నిత్య హోమాలు, రుద్రాభిషేకానికి ప్రత్యేక ఏరాట్లు
- అమరావతిలో కృష్ణమ్మకు హారతులు, తెప్పోత్సవం
- ఆలయాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

మహిమాన్విత క్షేత్రం అమరేశ్వరాలయం

పంచారామాలలో ప్రథమ ఆరామంగాను దక్షిణకాశీ పుణ్యతీర్థంగాను భక్తులచే పూజలందుకుంటున్న అమరావతిలోని అమరేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీకమాసం పురస్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని సందర్శించే భక్తులకు స్వామివారి దర్శనం సౌకర్యవంతంగా జరిగేలా ప్రత్యేక క్యూలైన్‌లు, మంచినీరు, ప్రసాదాలు పంపిణీ చేయడం జరుగుతుందని దేవస్థాన సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి వీ. సునీల్‌కుమార్ తెలిపారు. ప్రత్యేకంగా పంచారామాలు దర్శించి భక్తులకు సకాలంలో స్వామివార్ల దర్శనం జరిగేలా పర్యవేక్షిస్తామన్నారు. స్వామివారిని దర్శించుకోలేని భక్తులకు కార్తీకమాసం నెలరోజులు వారి గోత్ర నామాలతో పరోక్షంగా అభిషేకాలు చేసేందుకు రూ1,116 కార్యక్రమం ఉన్నట్లు తెలిపారు. కార్తీకపౌర్ణమి రోజున పవిత్ర కృష్ణమ్మకు హారతులు, స్వామివారి తెప్పోత్సవ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పంచారామక్షేత్రాల సందర్శనకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నట్లు గుంటూరు రీజనల్ మేనేజర్ రవికుమార్ తెలిపారు.





అమరేశ్వరాలయంలోని ప్రధాన మూడవ ప్రాకారం

నరసరావుపేట, పెదకాకాని, అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) కోటప్పకొండత్రికోటేశ్వర స్వామి సన్నిధిలో కార్తీక మాసంలో త్రికోటేశ్వర స్వామికి విశేష అభిషేకాలు జరగనున్నాయి. ఇందుకోసం ఏర్పాట్లు చేస్తున్నారు. కార్తీక మాసం అభిషేక పథకానికి భక్తుల నుంచి మంచి స్పందన లభించింది. నాలుగు వేల మందికి పైగా భక్తులు కార్తీక మాసం అభిషేక పథకంలో సభ్యులుగా చేరారు. ఉదయం 5:30 గంటల నుంచి ఆలయంలో అభిషేకాలు ప్రారంభ మవుతాయి. భక్తులు పరోక్షంగా స్వామి అభిషేకపథకంలో పాల్గొనేందుకు రూ 1,000 టిక్కెట్ చెల్లించాల్సి ఉంది. ఈ పథకంలో చేరితే ప్రతి రోజు స్వామికి అభిషేకాలు నిర్వహిస్తారు. ఈ పథకంలో చేరిన సభ్యులకు స్వామి వారి ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేస్తారు. కార్తీక మాసం అనంతరం స్వామి ప్రసాదం, శేష వస్త్రం కొరియర్ ద్వారా సభ్యులకు అందజేస్తారు. భక్తులకు ఉచిత దర్శనంతో పాటు రూ 100 స్పెషల్ దర్శనంగా ఏర్పాటు చేశారు. స్వామిని దర్శించుకున్న భక్తులకు ఉచిత ప్రసాదం అందజేస్తారు. ఆలయంలో నిత్యాన్నదాన పథకం అమలు జరుగుతున్నది. మధ్యాహ్నం 12:30 గంటల నుంచి 3 గంటల వరకు అన్నపూర్ణ సత్రంలో అన్నదానం చేస్తారు. కార్తీక మాసంలో స్వామికి ప్రత్యేక అభిషేకాలు, హోమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయగా ఆయా పనులను ఈవో డీ చంద్ర శేఖరరావు పర్యవేక్షిస్తున్నారు. స్వామి దర్శనం అనంతరం భక్తులు ఘాట్ రోడ్డు మార్గంలో ఉన్న పర్యాటక కేంద్రాన్ని సందర్శించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆది, సోమవారం, పౌర్ణమి, ఏకాదశి రోజుల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని అంచనా వేస్తూ దేవస్థానం ఇందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయనున్నది. నరస రావుపేట, చిలక లూరిపేట డిపోల నుంచి ఆర్టీసి బస్సులను కొండకు నిర్వహించను న్నారు. పోలీసు శాఖ భద్రతా చర్యలు చేపట్టింది.



అమరేశ్వరాలయంలోని ప్రణవేశ్వరుడు

మల్లేశ్వర స్వామికి నిత్య హోమాలు..

పెదకాకానిలోని శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో కార్తీక మాస ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఆలయ అధికారి, ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. కార్తీక మాస శుద్ధ పాడ్యమి నవంబరు 2 నుంచి డిసెంబరు 1 వరకు ఆలయంలో ఉదయం 8:30 గంటలకు మహన్యాస పూర్వక రుద్ర జప, రుద్రహోమం, ఏకాదశ రుద్రాభిషేక పూజలు నిర్వహించనున్నారు. రూ. 2000 పరోక్ష అభిషేక పథకాన్ని అధికారుల ప్రవేశపెట్టారు. చెల్లించిన వారికి గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. నవంబరు 26న భక్తులచే సామూహిక లక్ష బిల్వార్చన, 29న మాస శివరాత్రి రోజు పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, డిసెంబరు 1న కార్తీక అమావాస్య ఆదివారం రాహు, కేతు పూజలు విశేషంగా నిర్వహించనున్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో గోగినేని లీలా కుమార్ తెలిపారు.





పెదకాకాని మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం



యార్డు సెక్రెటరీ, సిబ్బందితో కలిసి వేలం కేంద్రాలను పరిశీలిస్తున్న జేసీ భార్గవతేజ

మిర్చియార్డు పర్సన్ ఇన్‌చార్జిగా

జేసీ బాధ్యతల స్వీకారం

గుంటూరు, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు (గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ) నూతన పర్సన్ ఇన్‌ఛార్జ్‌గా జాయింట్ కలెక్టర్ అమిలినేని భార్గవ తేజ బాధ్యతలు చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం మిర్చియార్డుకు వచ్చిన ఆయన తొలుత వినాయకుడి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం పర్సన్ ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు స్వీకరించి సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరీ వినుకొండ అంజనేయులు, ఇతర అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత మిర్చియార్డు ప్రాంగణంలోని వేలం కేంద్రాలు, ఈనామ్ బిడ్డింగ్ సెంటర్స్, కమీషన్ కొట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పర్సన్ ఇన్‌ఛార్జ్ భార్గవ తేజ మాట్లాడుతూ రాబోయే మిర్చిసీజన్‌కు ఇప్పటినుంచే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. రైతులు ఎక్కడా ఇబ్బంది పడకుండా చూడాలని ఆదేశించారు. రైతు విశ్రాంతి భవనాలు, ఉచిత భోజనశాలలో తగిన వసతులు కల్పించాలని సూచించారు. తాగు నీరు, పారిశుధ్య విషయంలో మరింత మెరుగ్గా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లభించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో గ్రేడ్-1 సెక్రెటరీ సుబ్రహ్మణ్యం, గ్రేడ్-2 సెక్రెటరీ ఆంజనేయ సింగ్, యార్డు ఇన్‌చార్జి శ్రీకాంత తదితరులు పాల్గొన్నారు.

ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్

అధికారిగా వెంకటేశ్వర్లు

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ (ఏపీఎంఐపీ) ప్రాజెక్ట్ ఆఫీసర్ సీటీ హరినాథరెడ్డిని ఉద్యానశాఖ అదనపు డైరెక్టర్‌గా బదిలీచేసి, అక్కడున్న ఎం.వెంకటేశ్వర్లును ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా ప్రభుత్వం నియమించింది. డిప్యూటేషన్‌పై పరస్పరం బదిలీ చేసినట్టు బుధవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

కోకో జోన్ల ఏర్పాటుకు కమిటీ .. ఏలూరు జిల్లాలో కోకో రైతులకు మద్దతుగా ఫ్యాక్టరీ జోన్ల కేటాయింపునకు ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఇద్దరు లేదా ముగ్గురు కోకో రైతులు, ఒకరు లేదా ఇద్దరు చొప్పున కోకో ప్రాసెసర్స్, ఆయిల్‌పామ్ ప్రాసెసర్స్, ఉద్యానశాఖ అదనపు సంచాలకులు, ఉద్యాన శాస్త్రవేత్త, జిల్లా ఉద్యాన అధికారితో కమిటీని ఏర్పాటు చేయాలని బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. కాగా రాష్ట్రంలో మత్స్యకారులు చేపల వేటకు నమోదు చేసుకున్న మర పడవలకు రాయితీ డీజిల్ సరఫరా కోసం కొత్తగా మరో 10 హెచ్ఎస్‌డీ ఔట్‌లెట్లకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.

రసాయన ఎరువులు తగ్గించి

జీవన ఎరువులు వాడండి

దాచేపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి జీవన ఎరువులను వాడాలని దాచేపల్లి వ్యవసాయ శాఖ అధికారిణి పాపకుమారి రైతులను కోరారు. బుధవారం దాచేపల్లి మండలం గామాలపాడు గ్రామంలో రైతులు పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జిలుగు, పిల్లిపెసర వాడకంతో భూసారం పెంచవచ్చు అన్నారు. పత్తి, కంది, వరి పంటలలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. రైతులు ఎరువులను తగ్గిస్తూ ప్రకృతి వ్యవసాయంపై అడుగులు వేయాలని కోరారు.

పొట్లంయాప్ పేరుతో ఎన్ఆర్ఐకి టోకరా

నరసరావుపేటలీగల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఎన్ఆర్ఐ పచ్చవ శ్రీనివాసరావును పొట్లం యాప్ పేరుతో రూ.50 లక్షలకు మోసగించినట్లు రెండవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. ఈకామర్స్ బిజినెస్ ట్రాన్‌సైజీ పేరుతో రూ. 50 లక్షలు తీసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెంకు చెందిన ఆలమంద శ్రీనివాసులు, పవన్, బిందు శ్రీ, రఘురామ్‌ల పై కేసు నమోదు చేశారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

గుంటూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బడుగులకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం లాంటిదని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం ఎనిమిది మంది లబ్ధిదారులకు రూ.5.69 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు.

పోలీసుల పవర్ చూపండి

- రౌడీల వెన్నులో వణుకు పుట్టాలి
- మంపు వీడి పోలీసింగ్‌పై దృష్టి పెట్టండి
- ఎస్పీ, ఏఎస్పీ, డీఎస్పీలకు ఐజీ దిశా నిర్దేశం

గుంటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సంఘ విద్రోహశక్తులు, రౌడీషీటర్లు, నేరస్తుల విషయంలో పోలీసులు అంటే ఏమిటో రుచి చూపించండి. మీరేం చేస్తారో నాకు తెలియదు రౌడీల ఆట కట్టించాలి. మంపు వీడి ప్రభుత్వ ఆశయాలు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలి.. అని రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి పోలీస్ యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. మంగళవారం తెనాలిలో రౌడీషీటర్ లడ్డు సాగించిన దౌర్జన్య కాండపై బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన రెచ్చిపోతున్న రౌడీషీటర్లు కథనంపై ఐజీ స్పందించారు. ఈ మేరకు బుధవారం ఆయన పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సతీష్‌కుమార్, ఏఎస్పీ రమణమూర్తి, డీఎస్పీలతో అత్యవసర సమావేశం నిర్వహించి రౌడీల కార్యకలాపాలు, వారి అణచివేతపై దిశానిర్దేశం చేశారు. రౌడీషీటర్ల వెన్నులో వణుకు పుట్టాలని, మరోసారి నేరం చేయాలనే ఆలోచనే వారిలో రాకూడదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే శక్తుల పీచమణచాలన్నారు. ప్రజలకు మేలు చేసే విషయంలో చిన్న, చిన్న పొరపాట్లు జరిగినా భయపడాల్సిన పనిలేదని తాను అండగా నిలుస్తానని చెప్పారు. కరుడుగట్టిన రౌడీషీటర్ల జాబితాను సిద్ధం చేసుకుని ఉక్కుపాదం మోపాలన్నారు. కొంతమంది పోలీసులు నేటికీ వైసీపీ నేతల కనుసన్నల్లోనే విధులు నిర్వహిస్తున్నారని, వారు పద్ధతి మార్చుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని స్పష్టం చేశారు. ఎవరైతే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారో, ఎక్కడైతే రౌడీషీటర్లు రెచ్చిపోతారో సంబంధిత ఎస్‌హెచ్‌వోలపై చర్యలు తప్పవన్నారు. నేరాలు, శాంతిభద్రతలు, దొంగతనాలు, ట్రాఫిక్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కొంతమంది పోలీసులు మెతకవైఖరి అవలంబిస్తున్నారని, వారు పద్ధతి మార్చుకోవాలన్నారు. రౌడీషీటర్లు, దొంగలతో సంబంధాలు కొనసాగించే పోలీసులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి

నూతన ఒరవడి సృష్టించాలి

గతానికి భిన్నంగా పోలీసు వ్యవస్థ నూతన ఒరవడి సృష్టించాలని ఐజీ తెలిపారు. స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం చేయాలని, మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డీఎస్పీలు జయరాం ప్రసాద్, అబ్దుల్ అజీజ్, టీ మురళీకృష్ణ, సీహెచ్ మురళీకృష్ణ, మల్లికార్జునరావు, సుబ్బారావు, శివాజీరాజు, సీతారామయ్య, రమేష్, సీసీఎస్ సీఐలు వెంకన్నచౌదరి, అల్తాఫ్ హుస్సేన్, ఎంవీ సుబ్బారావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్సు ఫీజుల పెంపు వద్దు

- ముక్తకంఠంతో వ్యతిరేకించిన కౌన్సిలర్లు



వినుకొండటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి)ఆంధ్రప్రదేశ్ మున్సిపాల్టీ చట్టం 1965 సంవత్సరం సెక్షన్ 263 ప్రకారం డీఅండ్‌వో ట్రేడ్ లైసెన్సు ఫీజులు వసూలుకు మున్సిపల్ కౌన్సిలర్లు ముక్త కఠంతో వ్యతిరేకించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ దస్తగిరి అధ్యక్షతన బుధవారం సాదారణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎజెండాలోని మొట్టమెదటి అంశంమైన ట్రేడ్ లైసెన్సులు అంశాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒక్క సారి లైసెన్సు ఫీజులు పెంచాల్సి ఉంది, కానీ 11 సంవత్సరాలనుండీ ఫీజులు పెంచక పోవడంతో మరో మారు లైసెన్సు ఫీజుల అంశం మరో మారు తెరమీదకు రావడంతో కౌన్సిలర్లు అడ్డు తగలడంతో ఫీజులు పెంపు అంశాన్ని రద్దు చేశారు. పట్టణంలో ఆక్రమణలపై అధికారుల తీరుపై ఏకంగా ఛైర్మన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆక్రమణలు జరుగకుండా అధికారులు పకడ్బందిగా చర్యలు తీసుకోకపోవడంతో పట్టణంలో ఆక్రమణలు పెరిగి పోయాయన్నారు. ఇదిలా ఉండగా ప్రతిసారి ఎజెండాలోని అంశాలను ఆమోదం తప్ప, అవి అమలు జరగక పోవడంపై కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎజెండాలో ప్రవేశ పెట్టిన అంశాలను అమలు చేసి, ప్రజలకు మెరుగైన సేవలు అందించి, పట్టణ అభివృద్ధికి పాటు పడాలని కౌన్సిలర్లు అధికారులను వేడుకున్నారు. రెండు అంశాలు మినహా మిగిలిన 24 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

రేషన్ షాపు నెంబరు 99పై కేసు

- జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కోమలి పద్మ

గుంటూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల తనిఖీలో అక్ర మాలు నమోదైన షాపు నంబరు 99పై కేసు నమోదు చేసినట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కోమలి పద్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన జారీ చేశారు. ఈ నెల 26న నిర్వహించిన తనిఖీల్లో షాపు నెంబరు 99లో 132.35 క్వింటాళ్ల నిల్వకుగానూ, 60 క్వింటాళ్ల నిల్వ మాత్రమే వుందని, 72.35 క్వింటాళ్ల బియ్యం వ్యత్యాసం ఉన్నట్లు గుర్తిం చామని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి ఈ నెల 29న జిల్లా కలెక్టర్‌కు నివేదించినట్లు తెలిపారు. ఆంధ్రజ్యోతి దినప్రతికలో బుధవారం ప్రచురితమైన కథనం నేపథ్యంలో అధికారులు పలు షాపుల్లో తనిఖీలు నిర్వహించి వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. షాపు నెంబరు 119లో 132 క్వింటాళ్లకు గానూ 107.5 క్వింటాళ్లు మాత్రమే బియ్యం నిల్వలు ఉన్నాయి. 25.16 క్వింటాళ్ల వ్యత్యాసం ఉందని, షాపు నెంబరు 55లో 58 కిలోల పంచ దార, 106 కిలోల కందిపప్పు వ్యత్యాసం వున్నట్లు గుర్తిం చామని వారిపై 6ఏ కేసులు నమోదు చేశామని తెలిపారు.

మాఫియాతో ఇబ్బందులు: డీలర్ లక్ష్మీకుమారి

గుంటూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తాము రేషన్ డీలర్లము మాత్రమేనని తమకు మాఫియాతో తమకు ఎలాంటి సంబంధం లేదని 9, 115 నెంబరు రేషన్ షాపుల డీలర్ లక్ష్మీకుమారి బుధవారం ఒక ప్రక టనలో తెలిపారు. గత 30 ఏళ్లుగా తాము డీలర్‌షిప్ నిర్వహిస్తున్నామని, మాఫియా గొడవలతో తమకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. మాఫియా గొడవల్లోకి డీలర్లను లాగి ఇబ్బందికి గురి చేస్తున్నారని, మాఫియా ముఠాల కుమ్ములాటల్లోకి డీలర్లను బలిపశువులను చేయ వద్దని కోరారు.

9న మేడ్ రాష్ట్ర మహాసభలు

గుంటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏసీ కళాశాలలోని జేడీ శీలం హాల్‌లో నవంబరు 9న జరిగే మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత్ ఎంప్లాయిస్ (మేడ్) రాష్ట్ర మహాసభలను విజయ వంతం చేయాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పిలుపు నిచ్చారు. మేడ్ రాష్ట్ర అధ్య క్షుడు మురికిపూడి దేవపాల్ ఆధ్వర్యంలో స్థానిక వసంతరాయపురంలోని ఎమ్మెల్యే కార్యా లయంలో బుధవారం రాష్ట్ర మహాసభ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దళిత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మేడ్ చేస్తోన్న కృషి స్ఫూర్తిదాయ కమన్నారు. అసో సియేషన్ అధ్యక్షుడు దేవపాల్ మాట్లాడుతూ దళిత ఉద్యోగుల సమస్యల పరిష్కారంతో పాటు అనేక కార్యక్రమాల నిర్వహణకు మేడ్ కృషి చేస్తుం దన్నారు. రాష్ట్ర 7వ మహాసభకు దళిత ఉద్యోగులు తరలి రావాలని కోరారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

గుంటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చోరీకేసులో ఇద్దరు నిందితులను కొత్తపేట పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని దొంగతనం కేసులలో నిందితులైన వెంగళ రావు నగర్ 2/6 కు చెందిన యద్దనపూడి దేనాభాస్కర్ అలియాస్ దేన, శ్రీనగర్ 6వ లైనుకు చెందిన వింజేపల్లి మేరిబాబు, మరో మైనర్‌ను అరెస్టు చేసి వారి నుంచి మూడు ద్విచక్ర వాహనాలు, కొత్త బట్టలు, బంగారపు వస్తువులు, కలర్ టీవీ స్వాధీనం చేసుకున్నారు. స్థానిక కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని గవర్నమెంట్ విమెన్స్ కాలేజీ రోడ్ లోని రెడీ మేడ్ బట్టల దుకాణంలో జరిగిన చోరీ కేసులో ముగ్గురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగిలించిన వాహనాలను, సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నింధితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచగా, 14 రోజుల పాటు జ్యుడిషియల్ కస్టడీకి తరలించినట్లు సీఐ వీరయ్య చౌదరి తెలిపారు.



విజేతలతో అసోసియేషన్ సభ్యులు, నిర్వాహకులు

సౌత్‌జోన్ నేషనల్ రోప్ స్కిప్పింగ్ పోటీలలో

విజేత ఆంధ్రప్రదేశ్

గుంటూరు(తూర్పు), అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి): సౌత్ జోన్ నేషనల్ రోప్ స్కిప్పింగ్ పోటీలలో విజే తగా ఆంధ్రప్రదేశ్ నిలిచింది. ఏపీ రోప్ స్కిప్పింగ్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో స్థానిక మాజేటి గురువయ్య డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీలు బుధ వారంతో ముగి శాయి. రెండవ స్థానంలో తెలంగాణ నిలిచింది అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్ అబ్దుల్ రహమాన్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రాల నుంచి ఈ పోటీలకు దాదాపు 100 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం బోస్‌బాబు, బండి సాహితీ చారిటబుల్ ట్రస్ట్ వ్యవ స్థాపకుడు బీఅశోక్ రెడ్డి, న్యాయవాది ఇంద్రశేఖరరెడ్డి అందజేశారు. వెంకటేశ్వరరెడ్డి, వేణు గోపాలరావు, తిరుపతిరావు, జీ శివప్రసాదు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీ డాక్టర్ శ్రీనివాస్

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీసీ డాక్టర్ శ్రీనివాస్

నరసరావుపేట లీగల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు ఉల్లంఘించి మద్యం వ్యాపారం నిర్వహించినట్లయితే చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని గుంటూరు, పల్నాడు జిల్లాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీసీ డాక్టర్ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. పట్టణంలోని ఈఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమంగా వేరే రాష్ట్రాల నుంచి సుంకం చెల్లించని మద్యం తీసుకు వచ్చినా, బెల్టుషాపులను నిర్వహించినా, ఎంఆర్‌పీల కంటే అధిక ధరలకు మద్యం విక్రయించినా, నాటు సారా తయారుచేసినా కఠిన చర్యలు తీసుకుంటామని డాక్టర్ శ్రీనివాస్ హెచ్చరించారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా నాటు సారా తయారు చేసే 11 గ్రామాలను గుర్తించామన్నారు. సదరు గ్రామాలపై పోలీసుల సహకారంతో తమ సిబ్బంది సంయుక్త దాడులు నిర్వహిస్తారన్నారు. ఇప్పటికి పల్నాడులో 14 బెల్టు షాపులపై కేసులు నమోదు చేశామన్నారు. నాటు సారా తయారీ కేంద్రాలపై తమ శాఖకు చెందిన ఏసీ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించనున్నామన్నారు. నాటు సారా తయారు చేసే వారు వారి ప్రవర్తన మార్చుకోని పక్షంలో పీడీ యాక్ట్ అమలు చేస్తామన్నారు. సమావేశంలో ఈఎస్ మణికంఠ, ఏఈఎస్, సీఐ పాల్గొన్నారు.



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారి చంద్రకళ, డిప్యూటీ విద్యాశాఖ అధికారి వేణుగోపాల్‌రావు

నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ
- కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో తనిఖీ

వినుకొండటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) రానున్న పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని, ఆహార పదార్థాల తయారీలో క్రమం తప్పకుండా మెనూ పాటించాలని పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ ఉపాధ్యాయులను ఆదేశించారు. స్థానిక ఎస్ఎస్‌పీ కాలనీలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాల్లో ఆవరణను పరిశీలించి ఉపాధ్యాయులపై అసహనం వ్యక్తంచేశారు. అనంతరం వంటగదిని పరిశీలించి తప్పనిసరిగా మెనూ అమలు చేయాలని ఆదేశించారు. వండిన ఆహార పదార్థాలను రుచిచూసి, నాణ్యతను పరిశీలించారు. ప్రతి రోజుక్రమం తప్పకుండా ఆన్‌లైన్ హాజరు వేయాలని తెలిపారు. విద్యార్థుల శక్తి సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ విద్యాశాఖ అధికారి వేణుగోపాల్‌రావు, పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

డీఈవోను కలిసిన ఎస్టీయూ నేతలు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా డీఈవోగా బాధ్యతలు చేపట్టిన ఎల్ చంద్రకళను ఎస్టీయూ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్టీఎఫ్ జాతీయ కార్యదర్శి సీహెచ్ జెసెఫ్ సుధీర్ బాబు, పల్నాడు జిల్లా అధ్యక్షు, ప్రధాన కార్యదర్శులు ఎల్వీ రామిరెడ్డి, యు.చంద్రజిత్ యాదవ్, రాష్ట్ర నాయకులు ఎస్ఎం సుభాని, వెంకటకోటయ్య, ఎస్కే కరిముల్లా, ఏమండీ, మహబూబ్ సుభాని, రామలింగయ్య, ఏషియా, రాఘవయ్య, పోటు శ్రీనివాసరావు, రామకోటయ్య, రామయ్య, బీష్మారావు, బీఎస్ఎన్‌రాజు, శంకర్‌నారాయణ, పీవీ శ్రీను, ఏడుకొండలు, ఏసురత్నం, వెంకటేశ్వర్లు, రమణ, రెహమాన్, సురేష్, వెంకయ్య, ధర్మారావు, కిషోర్, అప్పిరెడ్డి, అమర్నాథ్, ఆంజనేయులు, శేషలత, అర్చన, హుస్సేన్ బీ పాల్గొన్నారు.



డీఈవోకి శుభాకాంక్షలు తెలియజేస్తున్న సీహెచ్ జోసెఫ్ సుధీర్‌బాబు తదితరులు